## క్లుప్తంగా

### నలుగురు విద్యార్థుల ఎంపిక



జిల్లా క్రికెట్ టీమ్‌లకు ఎంపికైన విద్యార్థులు

**అమలాపురం టౌన్:** ఇటీవల అమలాపురం బాలయోగి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలు, సెలక్షన్స్‌లో గేమ్ ఆన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న నలుగురు విద్యార్థులు జిల్లా క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యారని కోచ్ మాగంటి అవినాష్ తెలిపారు. అండర్–14 విభాగంలో డి.రాణా చతుర్వేది, ఎస్.ఫణీంద్ర, కె.శ్యామ్యూల్, అండర్ –19 విభాగంలో జీఎస్ తేజ ఎంపికయ్యారన్నారు. వారిని గేమ్ ఆన్ క్రికెట్ అకాడమీ నిర్వాహకుడు కూచిమంచి కృష్ణ, ఆంధ్ర క్రికెట్ అకాడమీ కోచ్ నిమ్మకాయల శ్రీనివాస్ అభినందించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

**ఉప్పలగుప్తం:** రాష్ట్ర స్థాయిలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలకు గొల్లవిల్లి పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం లంకా రాణి గురువారం తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురం, విజయవాడ, కృష్ణ, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో జరిగే వాలీబాల్, బేస్‌బాల్ పోటీల్లో ఆయా విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణీంద్ర, డి.సరస్వతి, పీఈటీ వి.విజయభాస్కర్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

### 10న వైద్య విజ్ఞాన సదస్సు

**తాళ్లరేవు:** ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తాళ్లరేవు, యానాం శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఆదివారం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ భవనంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో మెదడు, వెన్నుముకపై న్యూరోసర్జన్‌లు నూకల బలరామ్‌నాయుడు, ఎస్ఎన్ బాబులు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, రెహమాన్ షరీఫ్, మోహన్ కోరారు.

### గోకులానికి గ్రాసం వితరణ



దాతను సత్కరిస్తున్న ఆలయాధికారులు

**ఐ.పోలవరం:** మండలంలోని వీరేశ్వర గోకులానికి ముమ్మిడివరం గ్రామానికి చెందిన జగత శ్రీను సుమారు రూ.20 వేలు విలువ చేసే ఎండుగడ్డి వితరణ చేశారు. దాతను ఆలయ పర్యవేక్షణాధికారి శ్రీనివాసరాజు శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

### డ్రగ్స్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న పట్టణ ఎస్సై శ్రీనివాస్

**అమలాపురం రూరల్:** నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో డ్రగ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పట్టణ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వాడడం వల్ల సమాజంలో అత్యాచారాలు, దాడులు, దోపిడీలు పెరుగుతున్నాయన్నారు. ఎక్కువగా యువత గంజాయికి, డ్రగ్స్‌కి బానిస అవుతున్నారని చెప్పారు. విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోకూడదని, బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ శర్మ, వలంటీర్లు ఫణీంద్ర, ఈశ్వర్, సరోజిని పాల్గొన్నారు.

### ఉల్లాస్‌పై సర్వేయర్లకు శిక్షణ

**యానాం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి సర్వేయర్లకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమగ్ర శిక్షా అభియాన్ సమావేశపు హాలులో ప్రాంతీయ విద్యాశాఖ ఆధ్వర్యంలో 33 సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. నూరు శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తుందని విద్యాశాఖాధికారి పి.లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో ఉల్లాస్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కర్రి భవాని ప్రసాద్, కోఆర్డినేటర్స్ ఓడియం లక్ష్మి, ఎ.విజయలక్ష్మి, మిషన్ స్త్రీ శక్తి సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్వానంగా పుష్కర ఘాట్

- కుండలేశ్వరంలో బురద మట్టితో పూడుకుపోయిన ఘాట్
- భక్తుల కోసం రక్షణ చర్యలు కరవు




బురద మట్టితో పూడుకుపోయిన కుండలేశ్వరం పుష్కర ఘాట్

**కాట్రేనికోన:** ఉమ్మడి గోదావరి జిల్లాలో పురాతనమైన, అత్యంత పవిత్రమైన శైవ క్షేత్రాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలోని కుండలేశ్వరం గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వరం ప్రసిద్ధి గాంచింది. 15వ శతాబ్దంలో మహాకవి శ్రీనాథుడు తన భీమ ఖండం, కాశీ ఖండాల్లో కుండలేశ్వరం క్షేత్ర విశిష్టతను వివరించారు. కాశీ వెళ్లడం కంటే ముందు కుండలేశ్వర క్షేత్రాన్ని దర్శించుకోవాలని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. గౌతమీ నదీలో స్నానం చేసి కుండలేశ్వరుని దర్శించుకోవడం ద్వారా అనంత కుండలాల ఫలితం వస్తుందని భక్తుల నమ్మకం. పరమశివునికి ఇష్టమైన కార్తిక మాసంలో గౌతమీ నదిలో స్నానం చేసి కుండలేశ్వరుని దర్శించుకోవడం శుభప్రదంగా భక్తులు భావిస్తారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనంతో కుండలేశ్వర స్వామి దర్శనం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూ కడుతున్నారు. అయితే ఇంతటి ప్రాముఖ్యత పొందిన క్షేత్రంపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. గోదావరి వరదతో వచ్చిన బురద మట్టితో కుండలేశ్వరం పుష్కర ఘాట్ పూర్తిగా పూడుకుపోయి గడ్డి, పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారైంది. స్థానిక యువత ముందుకు వచ్చి భక్తులు స్నానం చేసేందుకు తాత్కాలికంగా గట్టు ఏర్పాటు చేసి భక్తులు ప్రమాదాల బారిన పడకుండా కర్రలతో అడ్డుకట్ట వేశారు. అయితే భక్తుల భద్రతకు ఈ తాత్కాలిక ఏర్పాట్లు ఏమాత్రం సరిపోవడం లేదు.

**భక్తులకు తీవ్ర ఇబ్బందులు**

సాధారణ రోజుల్లో వందల్లో, పర్వదినాల్లో వేలల్లో భక్తులు కుండలేశ్వరానికి వస్తుంటారు. ప్రస్తుతం కార్తిక మాసం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న కుండలేశ్వరం ఆలయం వద్ద స్నానం ఆచరించేందుకు పుష్కర ఘాట్ ఏమాత్రం వీలుగా లేదని భక్తులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పుష్కరఘాట్ పూర్తిగా పూడుకుపోయింది. పైగా పుష్కర్ ఘాట్ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేవు. స్నానం చేసేందుకు నదిలో దిగిన భక్తులకు ఎక్కడెంత లోతు ఉందో అర్థం కాక ఐదారు అడుగులు లోపలకు వెళ్లేసరికే ఒక్కసారిగా దిగువకు పడిపోతున్నారు.



కార్తిక మాసం సందర్భంగా ఇబ్బందులు పడుతూనే గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు

నాలుగు నెలల క్రితం స్నానమాచరించేందుకు వచ్చిన భక్తుడొకరు ఇలాగే నదిలో కొట్టుకుపోయి మరణించాడు. అయినా పాలకులు మొద్దు నిద్ర వీడి పుష్కర ఘాట్‌లో మట్టి పూడికలను తొలగించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మహిళలు బట్టలు మార్చుకునేందుకు దాతలు నిర్మించిన రేకుల షెడ్డు సైతం శిథిలమై పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి యుద్ధప్రాతిపదికన పుష్కర ఘాట్ వద్ద పూడిక తొలగింపు పనులు చేపట్టడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

### వంతెన పూర్తి చేసేందుకు కృషి



ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

**ఐ.పోలవరం:** ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల మధ్య రాకపోకలకు అనువుగా వృద్ధ గౌతమీ నదీపాయపై నిర్మాణంలో ఉన్న జి.మూలపొలం వంతెన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని జి.మూలపొలెం గ్రామంలో గతంలో నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో బ్రిడ్జి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. 2008లో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించామని, తరువాత కాలంలో పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.76 కోట్ల నిధులు మంజూరు చేసిందని, నిధులతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.రాము, డీఈఈ వర్మ, జేఈ ఇంజినీర్ ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



ముమ్మిడివరంలో పాఠశాలను సందర్శించిన డీఈఓ సలీం బాషా

**అమలాపురం రూరల్:** చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించి వారి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీం బాషా అన్నారు. మండలంలోని కామనగరువు గ్రామ పరిధి అప్పన్నపేట మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలను, పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీం బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. చిన్నతనం నుంచి బాగా చదువుకోవాలని చిన్నారులకు సూచించారు. డీఈవో వెంట సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

**ముమ్మిడివరంలో..**

**ముమ్మిడివరం:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా గురువారం అకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారో పరిశీలించి తగు సూచనలు చేశారు. అపార్టు కార్డు జనరేషన్, ఆధార్ అప్‌డేషన్ తదితర అంశాలను పరిశీలించారు. ఆయన వెంట సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్‌ఎం బీర హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెరుగులంక భూములపై వివాదం

- సర్వే చేసిన రెవెన్యూ అధికారులు

**ముమ్మిడివరం:** వరదల సమయంలో నదీపాయల మధ్య వెలసిన పెరుగులంక భూమి కోసం ముమ్మిడివరం మండలం కమిని, లంకాఫ్ ఠానేల్లంక, గ్రామ రైతులకు కె.గంగవరం మండలం శేరుల్లంక గ్రామ రైతులకు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. వరదల సమయంలో రెండు నదీపాయల మధ్య సుమారు 105 ఎకరాల మేర మేట వేసింది. ఈ భూమి తమదంటే తమదని ఆయా గ్రామాల రైతులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గురువారం ముమ్మిడివరం తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్సై జ్వాలాసాగర్ పోలీసుల బందోబస్తు నడుమ సర్వే నిర్వహించారు. అమలాపురం, రామచంద్రపురం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్లు యామిని సుధ, ఎస్.శ్రీనివాస్, ముమ్మిడివరం, కె.గంగవరం మండల సర్వేయర్లు ప్రసాద్, పావని వివాదాస్పద భూమిలో సర్వే ప్రక్రియ చేపట్టారు. పాత రికార్డులు, సరిహద్దులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కె.గంగవరం మండలంలో రీసర్వే పూర్తయిందని, ముమ్మిడివరం మండలంలో వివాదస్పద గ్రామాల్లో రీసర్వే చేసి పూర్తి చేసి నివేదిక జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దార్ సుబ్బలక్ష్మి తెలిపారు. అప్పటివరకూ ఎటువంటి వివాదాలకు తావివ్వొద్దని ఆయా గ్రామస్తులను కోరారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

## దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

**అమలాపురం రూరల్:** మండలంలోని ఈదరపల్లి గ్రామ సచివాలయం–2లో గురువారం ఏర్పాటు చేసిన ఉపకరణాల గుర్తింపు శిబిరానికి దివ్యాంగులు పోటెత్తారు. విభిన్న ప్రతిభావంతులైన హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి అమలాపురం, ఉప్పలగుప్తం, అయినవిల్లి, అల్లవరం, అంబాజీపేట తదితర మండలాల నుంచి దివ్యాంగులు తరలివచ్చారు. పంచాయతీ ఉద్యోగులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. అలింకో కంపెనీ సిబ్బంది దివ్యాంగుల సదరమ్ క్యాంప్ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఉపకరణాలకు ఎంపిక ప్రక్రియ జరిపారు. దివ్యాంగులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈదరపల్లి పంచాయతీ ఉద్యోగులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఈదరపల్లిలో నిర్వహించిన శిబిరానికి హాజరైన దివ్యాంగులు

### 400 మంది అయ్యప్పస్వాములకు భిక్ష



స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన దాతలను సత్కరిస్తున్న గురుస్వాములు

**తాళ్లరేవు:** మండల పరిధిలోని సుంకరపాలెం శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయంలో నరహరిశెట్టి వీరబాబు బ్రదర్స్ ఆధ్వర్యంలో 400 మంది స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాముల పర్యవేక్షణలో 54 రోజుల భిక్షా కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సుంకరపాలెం, యానాం, తాళ్లరేవు ప్రాంతాలతో పాటు ఐ.పోలవరం మండలం నుంచి కూడా అయ్యప్పస్వాములు వచ్చి భిక్షను స్వీకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను గురుస్వాములు సత్కరించారు. కార్యక్రమంలో నరహరిశెట్టి విఘ్నేశ్వరరావు, పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, సుంకర బద్రి తదితరులు పాల్గొన్నారు.

## స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్‌పై విజయం



భీమనపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

**తాళ్లరేవు:** ప్రతిఒక్కరూ స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని వైద్యురాలు శ్యామల అన్నారు.

గురువారం గాడిమొగ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కుమారి, ఎంపీహెచ్‌ఈఓ బొడ్డు కుమార్, పీహెచ్ ఎన్.విజయకుమారి, హెచ్ఎస్ రంజన్, హెచ్‌వీ కుమారి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**ముందస్తు పరీక్షలతో ఎంతో మేలు**

**ఉప్పలగుప్తం:** ముందస్తు పరీక్షలతో మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే వ్యాధి నుంచి బయటపడొచ్చని భీమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లక్ష్మీ ప్రసన్న సూచించారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రామకృష్ణ, శుభారత్నం, సత్యవతి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



గాడిమొగలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## అభివృద్ధి పనులకు భూమి పూజ

**యానాం:** నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ గురువారం భూమి పూజ చేశారు. స్థానిక సుభద్రనగర్‌లో ఎన్నో ఏళ్లుగా ప్రజలు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే నిధులు రూ.13,62,790తో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా ది రెసిడెన్షియల్ టాక్సీ ఓనర్స్ కమ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల అభ్యర్థన మేరకు సుమారు రూ.9 లక్షలతో విశ్రాంతి భవనం(షెల్టర్) నిర్మాణానికి, కనకాలపేట జమ్ముబాడవ ప్రాంతంలో ప్రజా పనులశాఖ ద్వారా సుమారు రూ.44.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ ఆర్.మునిస్వామి, ఈఈ చంద్రశేఖరన్, ఇన్‌చార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఏఈ కాళ్ల నాగరాజు, జేఈ జ్యోతిరాజు, కుమార్, లక్ష్మి, ఆదిబాబు, చెల్లి గోపి, ఎస్సై మురుగానందం పాల్గొన్నారు.



యానాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్

## తప్పిన పెను ప్రమాదం

**అల్లవరం:** ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు వెళ్తున్న ట్రాలీ లారీ బుధవారం రాత్రి విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బెండమూర్లంక మార్కెట్ సెంటర్ నుంచి ఓడలరేవు వరకూ సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఈ నేపథ్యంలో భారీ వాహనాలన్నీ కొమరగిరిపట్నం ఊటగుంట సావరం మీదుగా ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు వెళుతున్నాయి. ఊటగుంట సావరం రోడ్డు ఇరుకుగా ఉండడంతో భారీ లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. దీంతో ఊటగుంట సావరం పరిధిలో బుధవారం రాత్రి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలకు జరిగిన నష్టాన్ని టాటా కంపెనీ నుంచి వసూలు చేసేందుకు చర్చలు జరిపారు. అయితే ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.



ట్రాలీ లారీ ఢీకొట్టడంతో పడిపోయిన విద్యుత్ స్తంభం

# మాలధారులకు దాతల సహకారం

- సుంకరపాలెంలో ఏటా అన్నదానం
- రోజుకు 400 మంది స్వాములకు భిక్ష

**తాళ్లరేవు:** అయ్యప్ప మాల ధరించిన స్వాములకు సుంకరపాలెం అయ్యప్పస్వామివారి ఆలయం వద్ద దాతల సహకారంతో ఏటా ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. ఏటా దసరా పండగ రోజున ప్రారంభించి 54 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరు నెల 12న ప్రారంభించిన ఈ అన్నదాన కార్యక్రమం డిసెంబరు 4వ తేదీ వరకూ కొనసాగించనున్నారు. సుంకరపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములకే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములకు కూడా మధ్యాహ్నం భిక్ష(భోజనం) ఏర్పాటు చేస్తున్నారు. గతంలో అయ్యప్పస్వామివారి ఆలయంలోనే ఈ కార్యక్రమం జరిగేది. అయితే మూడేళ్ల క్రితం ప్రత్యేకంగా ఒక శాలను ఏర్పాటు చేసి అన్నదానం చేస్తున్నారు. మాలధారులకు సహకరించాలన్న సదుద్దేశంతో ఎంతోమంది దాతలు ముందుకొచ్చి సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీంతో ఏటా మాలధారణ చేసే స్వాముల సంఖ్య పెరుగుతోంది. రోజూ భిక్ష ఏర్పాటు చేసే దాతల కుటుంబ సభ్యులు స్వాములకు స్వయంగా కాళ్లు కడిగి పాదపూజ చేసి అనంతరం అన్నదానం చేస్తారు. ప్రసాదం స్వీకరించిన స్వాములకు దాతలు వివిధ రకాల పండ్లతో తాంబూలాన్ని సమర్పిస్తున్నారు. అనంతరం దాతలను గురుస్వాములు, నిర్వాహకులు సత్కరిస్తున్నారు.



అయ్యప్పస్వాములకు పాదపూజ చేస్తున్న భక్తులు



సుంకరపాలెంలో భిక్ష స్వీకరిస్తున్న మాలధారులు

### అన్నదాన పథకానికి ఆదరణ



సుంకరపాలెంలో నిర్వహించే అన్నదాన పథకానికి దాతల ఆదరణ బాగుంది. రోజూ 400 మంది మాలధారులకు అన్నదానం చేస్తున్నాం. అయ్యప్పస్వామి ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నా అన్నదానాన్ని మాత్రం నిరాటంకంగా నిర్వహిస్తున్నాం.

– మల్లిపూడి చంద్రరావు, గురుస్వామి

### దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు



గ్రామంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సుంకరపాలెం పరిసర ప్రాంతాల నుంచే కాక కోనసీమలోని ఇతర దూర ప్రాంతాల నుంచి సైతం వచ్చి భిక్షను స్వీకరిస్తున్నారు. తొలుత 100 మందితో ప్రారంభించగా ప్రస్తుతం రోజుకు 400 మందికి పైగా భిక్షను స్వీకరిస్తున్నారు.

– తోట నారాయణరావు, గురుస్వామి

### దాతల సహకారం ఎనలేనిది



మాలధారుల కోసం ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి దాతల నుంచి వస్తున్న సహకారం ఎనలేనిది. స్వయంగా దాతలే వచ్చి తమ పేరున అన్నదానాన్ని సమర్పిస్తున్నారు. పలువురు దాతలు తమ పుట్టినరోజు, పెళ్లిరోజులతో పాటు ప్రముఖ తిథుల్లో అన్నదానం చేస్తున్నారు.

– తిరగళ్ల రాంబాబు, గురుస్వామి

### స్వాములకు సేవ చేయడం అదృష్టం




మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములకు రోజూ వంట చేసి వడ్డించడం అదృష్టంగా భావిస్తున్నాను. రోజూ నిష్టగా పరిశుభ్రంగా వంట చేసి స్వాములకు సమర్పిస్తున్నాము. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు.

– మల్లిస్వామి

### ఫ్లెక్సీ ఏర్పాటుపై వివాదం

**తాళ్లరేవు:** మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చొల్లంగి అభయాంజనేయ స్వామివారి ఆలయ ముఖ ద్వారం వద్ద గ్రామానికి చెందిన సీయోను ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. ఫ్లెక్సీ ఏర్పాటుపై భక్తులు, బజరంగ్‌దళ్ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని తక్షణమే తొలగించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై దేవదాయశాఖ అధికారులు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.ఫణీంద్రకుమార్ అక్కడకు చేరుకుని ఇరు పక్షాలతో చర్చలు జరిపారు. ఫ్లెక్సీను తొలగించడంతో వివాదం సద్దుమణిగింది.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజు

**తాళ్లరేవు:** మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ శ్రీరంగ నాయకపురం ఎంటీ రాజు బంగ్లా వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించలేక ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. గురువారం రాత్రి పెదవలసల నుంచి తాళ్లరేవు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న యానాం మెట్టకుర్రుకు చెందిన కర్రి నాగరాజు స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో వాహనం పైనుంచి ఎగిరి పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవ్వడంతో స్థానికులు అతడిని సమీప ఆస్పత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నాడు. స్పీడ్ బ్రేకర్‌పై తెల్లని గుర్తులు లేకపోవడం వల్ల రాత్రి సమయంలో అది కనిపించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.